క్లుప్తంగా

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుపల్లి



ఇఫ్తార్ విందుకు హాజరైన ఎమ్మెల్యే వాసుపల్లి

అల్లిపురం: రంజాన్ మాసం సందర్భంగా 39వ వార్డు క్వీన్‌మేరీ స్కూల్ వద్ద బుధవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పాల్గొన్నారు. ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు చేశారు. ఆయనతో పాటు వార్డు కార్పొరేటర్ సాధిక్, సౌత్ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ ముజీబ్‌ఖాన్, బాబ్జి, సలీం, సత్య, అఫ్సర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జడ్జిని కలిసిన సీపీ త్రివిక్రమ్‌వర్మ



జడ్జి గోపికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీపీ త్రివిక్రమ్‌వర్మ

దొండపర్తి: విశాఖ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సి.ఎం. త్రివిక్రమ్‌వర్మ బుధవారం జిల్లా జడ్జి జి.గోపిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీ-1 విద్యాసాగర్‌నాయుడు, డీసీపీ-2 ఆనందరెడ్డి, డీసీపీ(క్రైం) నాగన్న, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

జగదాంబ: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి 12.30 గంటలకు చోటు చేసుకుంది. హార్బర్ స్టేషన్ పరిధి సీ పోర్టు కనెక్టింగ్ బ్రిడ్జిపై నుంచి ఓ వ్యక్తి జారిపడి తీవ్ర రక్తస్రావంతో మృతి చెందినట్టు హార్బర్ పోలీసులు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి నీలం, నలుపు కలిగిన గళ్లషర్టు, నీలం రంగు జీన్స్‌ప్యాంటు ధరించినట్లు చెప్పారు. వయస్సు 40 సంవత్సరాలు ఉండొచ్చని గుర్తించారు. తెలిసిన వారు 9440796013, 9849589880 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అల్లిపురం: బంగారుమెట్టలోని శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం ఆధ్వర్యంలో బుధవారం ఉదయం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి స్థానికుల నుంచి చక్కటి స్పందన లభించింది. ఓమినీ ఆస్పత్రి సిబ్బంది ఉచితంగా బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించారు. అనారోగ్యంతో ఉన్న వారికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సమాజం ప్రతినిధులు భీశెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయిబాబా రథయాత్ర



రథయాత్ర ప్రారంభిస్తున్న భక్తులు

సీతమ్మధార: సత్యసాయిబాబా శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని నక్కవానిపాలెం సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టపర్తి నుంచి వచ్చిన రథం వద్ద ఘనంగా పూజలు చేసి యాత్ర ప్రారంభించారు. నక్కవానిపాలెం నుంచి సత్యం జంక్షన్ వరకు రథయాత్రకు హారతులిచ్చారు. దారి పొడవునా భక్తిశ్రద్ధలతో భక్తులు భజనాలు, సంకీర్తనలు చేశారు.

చలివేంద్రం జాడ లేదు

- గొంతెండి అల్లాడుతున్న పాదచారులు, సామాన్యులు
- కరుణించని నాయకులు.. సంస్థలు





పేరుకే చలివేంద్రం.. ఇక్కడ ఎలాంటి సేవలు అందటం లేదు

జగదాంబ: ఏటా నియోజకవర్గంలో మండే వేసవి సమయాన విరివిగా పెట్టే చలివేంద్రాలు ఇప్పుడు ఎక్కడా కానరాడంలేదు. దీంతో బయటికి వచ్చే సాధారణ ప్రజలు గుక్కెడు నీళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి సంవత్సరం జీవీఎంసీ ప్రజారోగ్యం కోసం నిధులు వెచ్చించి నగర నలుమూలలా చలివేంద్రాలు, మజ్జిగ కేంద్రాలు ఏర్పాటు చేసేది. అయితే గత రెండు సంవత్సరాలుగా కరోనా మహమ్మారి కారణంగా ఆ అలవాటు మానుకున్న జీవీఎంసీ ఈ ఏడాది కూడా కరోనా లేకపోయినా ఎక్కడా చలివేంద్రాలు పెట్టిన దాఖలాలు కనిపించడంలేదు.

కనిపించని నాయకులు

ఎన్నికలకు ముందు భయంకరమైన కరోనా ప్రభంజనం సాగుతున్న సమయంలో కూడా ప్రాణాలకు తెగించి కరోనా బాధితులకు, బయటికి రాలేని వారికి ఎన్నో సేవలు చేసి.. శానిటరీ వస్తువులు, మందులు, ఆహార పొట్లాలు, కాయకూరల వంటివి అందజేసిన నాయకులు ఇప్పుడు ఎక్కడా ఒక్క చలివేంద్రం పెట్టకపోవడం విచారకరమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాదు సేవా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు కూడా ఈ విషయంలో అడుగు ముందుకు వేయకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందని అంటున్నారు.

అతి పెద్ద పూర్ణామార్కెట్‌లో ఒక్కటైనా లేదు

ఈ ఏడాది ఎండలు ప్రారంభంలోనే మండిపోతున్నాయి. ఇంటి నుంచి ఏదో పని మీద బయటికి వెళ్లే పెద్దలు, పరీక్షలు రాసేందుకు విద్యార్థులు, వ్యాపార లావాదేవీలపై వ్యాపారులు తప్పనిసరిగా బయటికి వస్తుంటారు. అలా వచ్చిన వారి దాహార్తి తీర్చేలా ఇప్పుడు నియోజకవర్గ పరిధిలో ఎక్కడా ఒక్క చలివేంద్రం కూడా లేకపోవడంతో వారంతా ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా పూర్ణామార్కెట్ వంటి అతి పెద్ద ప్రాంతంలో ఎక్కడా ఒక్క చలివేంద్రం లేకపోవడం వెలితిగానే భావించాలి. ఇక్కడికి విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, అల్లూరి వంటి పలు ప్రాంతాల నుండి ప్రజలు విచ్చేస్తూ ఉంటారు. వారంతా గుక్కెడు నీళ్ల కోసం ఎదురు చూస్తుంటారు.

తన వంతు పాత్ర పోషించిన స్వామి వివేకానంద సంస్థ

ఈ ఏడాది ఎండలు అప్పుడే తారెత్తిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతున్నాయి. గతంలో ఈ పాటికే నియోజకవర్గంలో చలివేంద్రాలు ఏర్పాటయ్యేవి. ప్రజల దాహార్తి తీర్చేవి. ఈ ఏడాది ఆ సేవలు ఎక్కడా ప్రారంభం కాలేదనుకుంటున్న తరుణంలో బుధవారం (ఏప్రిల్ 12) నాడు స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ రాగి జావ చలివేంద్రాన్ని ప్రారంభించి ఉపశమనం కలిగించింది.

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ఉదయం ఈవో రమాబాయి ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం భక్తుల స్వహస్తాలతో అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాస్ భక్తుల నామగోత్రాలతో పూజాధికాలు జరిపారు. ఎరుకుమాంబ అమ్మవారు కలియుగంలో వెలసిన పార్వతీ దేవిగా భక్తులు భావించి ప్రతి బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయంత్రం 3 నుంచి 6 గంటల వరకు పసుపు నీళ్లతో అభిషేకం చేయడం ఆచారంగా వస్తోంది. ఇలా చేయడం వల్ల కోర్కెలు నెరవేరుతాయని, పెళ్లికాని వారికి పెళ్లి అవుతుందని, పిల్లలు లేనివారికి పిల్లలు పుడతారని భక్తుల నమ్మకమని అర్చకులు శ్రీనివాస్ తెలిపారు. జలాభిషేకం అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

'మోదీ పాలన అంతం కావాలి'



ప్రచార జాతా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు

అల్లిపురం: దేశంలో మోదీ పాలన అంతం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. బుధవారం సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజుతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రచార జాతా పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ యాత్ర స్టీల్ ప్లాంట్ కోసం చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా చేపడుతున్న కార్యక్రమాలను నిరసిస్తూ ఈ నెల 14 నుంచి 30 వరకు సీపీఐ, సీపీఎం సంయుక్తంగా ప్రచార భేరి పేరిట కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 14వ తేదీ ఉదయం 9 గంటలకు నగరంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బాబా సాహెబ్ జయంతి కార్యక్రమం అనంతరం అక్కడి నుంచి పాద యాత్రలు జిల్లాలో అన్ని వార్డులు, మండలాల్లో జరుగుతాయని పేర్కొన్నారు. ఈ నెల 26న గాజువాకలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

వివేకానంద సంస్థ సేవలు ఎనలేనివి



రాగిజావ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: ఎండల తీవ్రత దృష్ట్యా పాదచారులు.. వాహనచోదకుల దాహార్తి తీర్చేందుకు స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ రాగి జావ చలివేంద్రాన్ని ప్రారంభించింది. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ చేతుల మీదుగా బుధవారం సంస్థ సభ్యులు దీనిని ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కూడా సంస్థ ఎన్నో పోషకాలు గల రాగి జావను, మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి బాటసారులు, కార్మికులకు అందిస్తుందని అన్నారు. ఇలాంటి సేవలందిస్తున్న సంస్థ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో కనకమహాలక్ష్మి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, ముస్లిం మైనార్టీ నాయకుడు ముజీబ్‌ఖాన్, యాసీన్, బాబ్జి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 37వ వార్డులో రూ.24 లక్షలతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ బుధవారం భూమిపూజ చేశారు. రూ.18 లక్షలతో అంబేడ్కర్ కల్యాణమండపం ఆధునికీకరణ, రూ.6 లక్షలతో అంబేడ్కర్ జంక్షన్ వద్ద కల్వర్టు ఆధునికీకరణకు వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్‌తో కలిసి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాంతంలో విశాలంగా ఉన్న అంబేడ్కర్ కల్యాణ మండపం పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ ఇన్‌చార్జి పీతల వాసు, 38వ వార్డు అధ్యక్షుడు శంకభక్తుల సన్యాసిరావు, రెయ్యి రేవతి డేవిడ్‌రాజు, మీసాల అశోక్‌కుమార్, నొల్లు చంటి, శ్రావణ్, రామరాజు, ఎల్లాజీ, చెన్నా శైలజ తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి సింహగిరిపై చందనం అరగదీత

- మూడు మణుగులు అరగదీసేందుకు ఏర్పాట్లు



ఆలయ బేడా మండపంలో సిద్ధం చేసిన శానలు

సింహాచలం : సింహగిరిపై తొలివిడత చందనం అరగదీత కార్యక్రమాన్ని ఈ నెల 16 నుంచి శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్టు సింహాచలం దేవస్థానం ఏఈవో ఇజిరోతు శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 6.30 గంటలకు ఆలయంలో తొలి చందనం చెక్కకు పూజలు నిర్వహించిన అనంతరం అరగదీత ప్రారంభమవుతుందని తెలిపారు. పన్నెండు మణుగుల చందనం (480 కిలోలు చందనం)లో ఉండే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఒక్క వైశాఖ శుద్ధ తదియ రోజు (చందనోత్సవం రోజు) మాత్రమే నిజరూప దర్శనాన్ని అందజేస్తారు. అదే రోజు రాత్రి స్వామికి తొలివిడతగా మూడు మణుగుల చందనాన్ని (120 కిలోలు) సమర్పించి మళ్లీ నిత్యరూపభరితున్ని చేస్తారు. తదుపరి వైశాఖ, జ్యేష్ఠ, ఆషాడ పౌర్ణమి రోజుల్లో మరో మూడేసి మణుగుల చందనాన్ని (120 కిలోల చొప్పున) స్వామికి సమర్పిస్తారు. ఈ నెల 23న చందనోత్సవం కావడంతో ఆ రోజు రాత్రి తొలివిడతగా సమర్పించేందుకు కావాల్సిన చందనాన్ని సమకూర్చేందుకు ఈ నెల 16వ తేదీ నుంచి అరగదీతను చేపట్టనున్నారు. ఈ మేరకు ఆలయ బేడా మండపంలో అరగదీతకు వీలుగా శానలను ఏర్పాటు చేశారు.

ఆలోచింపజేసిన 'వెండి అంచులు'



వెండి అంచులు నాటకంలో ఓ సన్నివేశం

మద్దిలపాలెం : విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ(వీఎండీఏ) ఆధ్వర్యంలో పైడా కౌశిక్ రాష్ట్రస్థాయి నాటక పోటీలు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్.రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, ట్రస్టీ పైడా కృష్ణప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి శ్రీకారం చుట్టారు. అనంతరం తాడేపల్లికి చెందిన అరవింద ఆర్ట్స్ ఆధ్వర్యంలో వెండి అంచులు నాటకాన్ని ప్రదర్శించారు. పల్లూరూ శివప్రసాద్ రచించిన ఈ నాటకానికి గంగోత్రిసాయి దర్శకత్వం వహించగా.. సంగీతం సత్యనారాయణమూర్తి సమకూర్చారు. ఏడు పదుల దాటిన వయసులో పురుషుడు తనకంటే చిన్నది అయిన మహిళను పెళ్లి చేసుకోవచ్చా అనే అంశంపై ప్రదర్శించిన నాటక అందరిని మేల్కొలిపింది.

అనంతరం రెండో నాటకంగా పెందుర్తికి చెందిన శ్రీనటరాజ డ్రమటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనుకోని అతిథి నాటకాన్ని ప్రదర్శించారు. దీనిని రావి నాగేశ్వరరావు రచించగా, పిళ్లా సన్యాసిరావు దర్శకత్వం వహించారు. మనిషి బతకడానికి కావల్సింది డబ్బే కాని.. డబ్బే సర్వస్వం కాదనే ఇతి వృత్తంతో సాగిన ఈ నాటకం అత్యంత సహజంగా సాగి ప్రేక్షకుల హృదయాలను ఎంతగానో హత్తుకుంది.

చురుగ్గా 'మా నమ్మకం నువ్వే జగన్'



గృహిణికి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న పాల శ్రీహరిరెడ్డి, గృహసారథి, వలంటీర్లు



36వ వార్డులో సంక్షేమ ఫలాలు వివరిస్తున్న కార్పొరేటర్ మేరీజోన్స్, రాజు



29వ వార్డులోని ఓ వీధిలో ప్రభుత్వ సంక్షేమ ఫలాలు వివరిస్తున్న కార్పొరేటర్ నారాయణరావు

అల్లిపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం చురుగ్గా కొనసాగుతోంది. 33వ వార్డు కుమ్మరవీధి సచివాలయం ఆధ్వర్యంలో బుధవారం వార్డు నాయకుడు, టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరిరెడ్డి, గృహసారథి డిచ్చా నీలరాణి , వలంటీర్ హేమలత బంగారుమెట్టలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేపట్టారు. ప్రతి ఇంటికి స్టిక్కర్ అంటించి వారికి ప్రభుత్వ పథకాలను వివరించారు.

పలు వార్డుల్లో..

డాబాగార్డెన్స్: 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం బుధవారం ఆరవ రోజుకి చేరింది. 36వ వార్డులో ఆ వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరీ జోన్స్, వార్డు అధ్యక్షుడు రాజు నేతృత్వంలో పలు ప్రాంతాల్లో కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అంటించారు. 29 వార్డులో ఆ వార్డు కార్పొరేటర్ ఉరికిటి నారాయణ రావు నేతృత్వంలో పలు ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు వివరించారు. కార్యక్రమంలో కన్వీనర్లు, వార్డు నాయకులు, గృహ సారథులు, వలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు. 31వ వార్డులో ఆ వార్డు నాయకుడు దొడ్డి బాపూ ఆనంద్ నేతృత్వంలో వార్డు పరిధి భీమ్‌నగర్, ద్వారకాబజార్ సచివాలయాల పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు వివరించారు. కార్యక్రమంలో కన్వీనర్ కర్రి ధనలక్ష్మి, పిలక మోహన్, గృహసారథులు వాసుపల్లి ధనరాజ్, బబ్లూ, కిషోర్, సారిక తదితరులు పాల్గొన్నారు. 28వ వార్డులో క్లస్టర్ ఇన్‌చార్జి పీతల వాసు, వార్డు నాయకుడు పల్లా అప్పలకొండ నేతృత్వంలో కార్యక్రమం నిర్వహించారు.

పథకాల అమల్లో మనమే నంబర్‌వన్

'మా నమ్మకం నీవే జగనన్న - జగనన్నే మా భవిష్యత్తు'కార్యక్రమం బుధవారం జీవీఎంసీ 37వ వార్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలో ముందంజలో ఉందన్నారు. పార్టీ తరఫున సచివాలయ కన్వీనర్లతో పాటు వారి తర్వాత స్థాయిలో పనిచేసే గృహసారథుల నియామకం తర్వాత తొలిసారిగా భారీ కార్యక్రమంతో ప్రజలతో మమేకమవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్, జేసీఎస్ ఇన్‌చార్జి పీతల వాసు, రెయ్యి రేవతి డేవిడ్‌రాజు, శ్రీకనకమహాలక్ష్మి దేవస్థానం ట్రస్టీ మీసాల అసోక్‌కుమార్, పార్టీ నాయకులు యల్లపు రఘురామ్, ఎర్రబిల్లి ప్రభాకర్, కాసారపు వాసు, ఆకుల యేసు, శ్రావణ్, రామరాజు, ఎల్లాజీ, చెన్నా శైలజా, ఆదిలక్ష్మి, రమ్య, రోజా, ఆనంద్, రమణ, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.



28వ వార్డులో ఒక ఇంటికి స్టిక్కర్ అంటిస్తున్న పీతల వాసు, పల్లా అప్పలకొండ తదితరులు



సంక్షేమ ఫలాల కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

సిరులతల్లికి నేడు సహస్ర తులసీ దళార్చన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువై ఉన్న కనక మహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

48వ వార్డులో విద్యుత్ సమస్యలపై వినతి

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం కొండవాలు ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం మర్రిపాలెం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ త్రినాథ్‌కు బీజేపీ వార్డు అధ్యక్షుడు గంకల అప్పారావు వినతిపత్రం అందించారు. వేసవి దృష్ట్యా వార్డులో పర్యటించి విద్యుత్ సమస్యలను గుర్తించామని అప్పారావు తెలిపారు. అధికారులు సానుకూలంగా స్పందించారన్నారు.

జగనన్నే మళ్లీ సీఎం కావాలని పూజలు



భద్రాచలంలో అమ్మవారి సన్నిధిలో పూజలు చేస్తున్న సంపంగి శ్రీనివాసరావు, డ్వాక్రా ఆర్పీలు


- భద్రాచలం చేరిన బస్సు యాత్ర

సీతంపేట: జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని సింహాచలం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విశాఖపట్నం నుంచి భద్రాచలం వరకు చేపట్టిన బస్సు యాత్ర బుధవారం భద్రాచలం చేరుకుంది. డ్వాక్రా ఆర్పీలు, స్థానిక మహిళా నాయకులతో కలిసి మంగళవారం ఉదయం సీతంపేట మూడు గుళ్ల నుంచి బస్సులో యాత్రకు బయలుదేరిన విషయం తెలిసిందే. మార్గమధ్యలో అనకాపల్లి నూకాలమ్మ, తలుపులమ్మ లోవలో అమ్మవార్లకు పసుపు కుంకుమ సమర్పించి మళ్లీ జగనన్నే సీఎం కావాలని ప్రార్థించారు. అక్కడి నుంచి భద్రాచలం చేరుకుని సీతమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించారు. సీతారాములకు కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. గత నాలుగేళ్లుగా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా సంక్షేమ పాలన అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి మరలా ముఖ్యమంత్రి కావాలని వేడుకున్నారు. అనంతరం సంపంగి శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళా సాధికారతే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నవరత్నాల పేరిట సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. వాటి ప్రయోజనాలు నేరుగా మహిళలకే అందజేస్తున్నారని గుర్తుచేశారు. లంచాలు, అవినీతికి తావులేకుండా సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ పథకాలు అందజేసి, ప్రజలందరి మన్ననలు అందుకున్నారని కొనియాడారు. అటువంటి గొప్ప నాయకుడే మరలా సీఎం కావాలని యాత్ర చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు భీమవరపు శ్రీనివాసరావు, నమ్మి పద్మా వెంకట్ పాల్గొన్నారు.

శ్రీనివాసుడి కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు

మురళీనగర్: ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీనివాసుడి కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వైశాఖ శుద్ధ ఏకాదశి మే 1వ తేదీ నుంచి 5 వరకు ఉత్సవాలు జరపాలని నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. 1వ తేదీన ఉదయం 5 గంటలకు త్రయాహ్నిక దీక్షతో పాంచరాత్రాగమ విధానంలో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఉదయం సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, బాలభోగం, మంగళాశాసనం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రుత్విగ్వరుణ, రక్షాసూత్రబంధన, మృత్సంగ్రణం, అంకురార్పణ, పతాక ప్రతిష్ఠ, విశేష హోమం, మహానివేదన, మంగళాశాసనం నిర్వహిస్తారు.

అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలు రేపు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సొసైటీ ప్రతినిధులు

సీతంపేట: అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ 132వ జయంతి వేడుకల సందర్భంగా ఈ నెల 14న పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు సొసైటీ అధ్యక్షుడు బొద్దు కల్యాణరావు, ప్రధాన కార్యదర్శి జె.వి.ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమ కరపత్రాలను రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో బుధవారం ఆవిష్కరించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం-ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుందాం అనే పిలుపుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 14న ఉదయం 9.30 గంటలకు ఎల్ఐసీ బిల్డింగ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తామని చెప్పారు. 11 గంటలకు అంబేడ్కర్ భవన్ ప్రాంగణంలో ఆధునికీకరించిన గ్రంథాలయాన్ని విశాఖ ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణ ఆవిష్కరిస్తారని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ఎల్ఐసీ అంబేడ్కర్ విగ్రహం నుంచి అంబేడ్కర్ భవన్ వరకు ర్యాలీ అనంతరం అంబేడ్కర్ జయంతి మహాసభ జరుగుతాయన్నారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.